క్లుప్తంగా

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలి

మన్ననూర్: కులం పేరుతో దూషించిన వారిపై చర్యలు తీసుకోవాలని స్థానిక వేణుగోపాల స్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడు (దళితుడు) శివాజీ గెలువయ్య డిమాండ్ చేశారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. వేణుగోపాల స్వామి ఆలయం ప్రాంగణంలో ప్రతి ఏట ఉట్లు కొట్టే పక్రియను ఆలయ కమిటీ అధ్యక్షుని సమక్షంలో కొనసాగించడం ఆనవాయితీ అని ఈ సందర్భంగా ఉట్లు కొట్టే కార్యక్రమంను ప్రారంభించేందుకు వెళ్తే కొందరు యాదవులు నీవు దళితునివి కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు అనర్హుడవని అడ్డుకున్నారని వాపోయారు. దీంతో బుధవారం గ్రామస్తులతో కలిసి అమ్రాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

వెల్దండ: గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఎస్‌ఐ కురుమూర్తి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వినాయక మండపాల కోసం నిర్వాహకులు యాప్‌లో నమోదు చేసి కాపీని పోలీస్‌స్టేషన్‌లో ఇవ్వాలన్నారు. విద్యుత్ తీగలతో జాగ్రత్తగా ఉండాలన్నారు. పోలీసుల సలహాలు, సూచనలు పాటించాలని ఆయన పేర్కొన్నారు.

ఇందిరమ్మ ఇంటికి భూమి పూజ

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను బుధవారం మార్కెట్ కమిటీ చైర్మన్ దండు నర్సింహ భూమ పూజ చేసి ప్రారంభించి మాట్లాడారు. నిబంధనల ప్రకారం ఇల్లు నిర్మించుకున్నవారికి ప్రభుత్వం రూ. 5 లక్షలు మంజూరు చేస్తుందన్నారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి నాగశేషి, బాలస్వామి, తిరుపతయ్య, మహేష్, నాగరాజు, మల్లేష్, శంకర్, కృష్ణయ్య, బాలయ్య, రాజల్‌గౌడు పాల్గొన్నారు.

కోడేరు: మండలంలోని జనుంపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు బుధవారం ఎంపీటీ మల్లేష్ భూమి పూజ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మహిపాల్‌రెడ్డి, కృష్ణయ్య, మాజీ ఉపసర్పంచ్ శ్రీను పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

చారకొండ: మండలంలోని చంద్రాయన్‌పల్లిలో బుధవారం ఎర్ర రామయ్య మృతిచెందగా, ఇటీవల మృతి చెందిన మాడుగుల ముత్తయ్య, ఎల్లేటి లింగయ్యలు మృతిచెందారు. బాధిత కుటుంబాలను వెల్దండ సింగిల్ విండో చైర్మన్ జూపల్లి భాస్కర్ రావు ఫోన్‌లో పరామర్శించారు. ఆయన సూచన మేరకు స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు ఒక్కో కుటుంబానికి రూ. 5 వేల చొప్పున ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సత్తయ్య గౌడ్, స్థానిక నాయకులు అప్పల శేఖర్‌గౌడ్, కొళ్ల శ్రీనయ్య, సత్తయ్య, బాల్‌లక్ష్మయ్య, మాణిక్యం, రామస్వామి, మల్లేష్, తదితరులు ఉన్నారు.

బూటకపు ఆపరేషన్ 'కగార్' నిలిపివేయాలి

మన్ననూర్: కేంద్ర ప్రభుత్వం వెంటనే బూటకపు ఆపరేషన్ కగార్ నిలిపివేయాలని కుల నిర్మూలనా పోరాట సమితి రాష్ట్ర నాయకుడు ముద్దునూరి లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. ఈ నెల 24వ తేదీన వరంగల్‌లోని అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించే ఆదివాసి హక్కుల పోరాట సంఘీభావ వేదిక బహిరంగ సభకు సంబంధించిన వాల్ పోస్టర్లను బుధవారం మన్ననూరులో ఆయన విడుదల చేసి మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆపరేషన్ కగార్ పేరుతో అమాయకులైన ఆదివాసీలపై కేంద్ర ప్రభుత్వం హత్యలకు పాల్పడుతుందని ఆయన ఆరోపించారు. జనవరి 2024 నుంచి ఇప్పటి వరకు 70 బూటకపు ఎన్‌కౌంటర్‌లలో ఆదివాసీలు, ఉద్యమకారులను పొట్టన పెట్టుకున్నారన్నారు. తక్షణమే బూటకపు ఆపరేషన్ కగార్ హత్యాకాండ, కాల్పులను విరమించుకోవాలన్నారు. ప్రజా సంఘాల నాయకులు ఎడ్ల అంబయ్య, గోరటి అనిల్, పంబలి బాలయ్య, పర్వతాలు, గోపాల్, వెంకటేష్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు అధ్యాపకుడికి డాక్టరేట్



తాడూరు: మండల కేంద్రంలోని కూచుకుళ్ల సౌభాగ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల తెలుగు అధ్యాపకుడు, రచయిత నర్ర ప్రవీణ్‌రెడ్డికి డాక్టరేట్ ప్రదానం చేశారు. గవర్నర్ విష్ణుదేవ్‌వర్మ సమక్షంలో ఉస్మానియా విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ చేతుల మీదుగా డాక్టరేట్ పట్టా అందుకున్నాడు. కళాశాల సిబ్బంది ఆయనను అభినందించారు.

కొండనాగుల వాసికి..

బల్మూర్: మండలంలోని కొండనాగుల గ్రామానికి చెందిన డా.మౌలాలికి బుధవారం గవర్నర్ జిష్ణుదేవ వర్మ చేతుల మీదుగా డాక్టరేట్ పట్టా పొందారు. గతంలో 2016లో హిందీలో పోస్టుగాడ్యుయేషన్ చేయడంతో మొదటిసారి డాక్టరేట్ అందుకున్నాడు. దీంతో మౌలాలిని గ్రామస్తులు అభినందించారు.

అద్దె భవనంతో అవస్థలు

- ఐదెకరాల స్థలం ఉన్నా స్వంత భవనం లేదు
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు



తరగతి గదిలో విద్యార్థులు



అద్దె భవనంలో ఉన్న గురుకుల పాఠశాల

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాలను ఏర్పాటు చేశారు. 5వ తరగతి నుంచి ఇంటర్ వరకు మొత్తం 508 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. అంతా బాగానే ఉన్నా పాఠశాలకు సొంత భవనం లేక విద్యార్థుల ఇబ్బందులు పడుతున్నారు. కనీసం మౌలిక వసతులు కల్పించడంతో పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. అద్దె భవనంలో గదులు చిన్నగా ఉండటంతో ఇరుకు గదులల్లో తరగతులను నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంది. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అవస్థలు తప్పడంలేదు. సరిపడా తరగతి గదులు, రీడింగ్ గదులు, భోజనం గదులు కూడా కరువయ్యాయి. సరిపడా మరుగుదొడ్లు, మూత్రశాలలు లేకపోవడంతో నరకయాతన అనుభవిస్తున్నారు. ప్రతి రోజు విద్యార్థులకు ఇబ్బందులు తప్పడంలేదు. ప్రతి నెల అద్దె భవనానికి రూ.50 వేలు కిరాయి చెల్లిస్తున్నారు.

ఆట స్థలం కరువు

గురుకుల పాఠశాల అద్దె భవనంలో కొనసాగడంతో విద్యార్థులకు ఆట స్థలం లేదు. ఆటలకు దూరమవుతున్నారు. సెలవు రోజుల్లో కూడా సమీపంలోని రైతుల వ్యవసాయ పొలాలకు వెళ్లి ఆడుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. వ్యాయామం చేసేందుకు స్థలం లేకపోవడంతో హాస్టల్‌కే పరిమితమవుతున్నారు.

స్థలం ఉన్నా స్వంత భవనం లేదు

మండల కేంద్రంలో ఉన్న గురుకుల పాఠశాలకు చంద్రకళ్ వద్ద జాతీయ రహదారి పక్కన 42 సర్వే నెం.లో ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించి పొలానికి ప్రహరీ నిర్మించారు. స్వంత భవనం నిర్మించకపోవడంతో పొలం నిరుపయోగంగా ఉంది. గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతిలో 68 మంది, 6వ తరగతి 75, 7వ తరగతిలో 79, 8వ తరగతిలో 66 మంది, 9వ తరగతిలో 77 మంది, 10వ తరగతిలో 78మంది, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 42 మంది, ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 80 మంది విద్యార్థులు చదువుతున్నారు. విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని గురుకుల పాఠశాలకు స్వంత భవనం నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

ఇరుకు గదులతో ఇబ్బందులు



పాఠశాలలో ఇరుకు గదులతో ఇబ్బందులు పడుతున్నాం. చదువుకునేందుకు ఆసక్తి ఉండటం లేదు. అద్దె భవనంలో పాఠశాల కొనసాగుతోంది. తరగతి గదులలో బెంచీలు లేకపోవడంతో కింద కూర్చుంటున్నాం. స్వంత భవనం నిర్మిస్తే ఇబ్బందులు పోతాయి.

–సిద్దార్థ, 9వ తరగతి, గురుకుల పాఠశాల

సరిపడా మరుగుదొడ్లు లేవు



పాఠశాలలో మొత్తం 508 మంది విద్యార్థులకు 8 మరుగుదొడ్లు మాత్రమే ఉన్నాయి. ఉదయం వేళ క్యూలో నిల్చోవాల్సిన దుస్థితి ఏర్పడింది. స్నానాలు చేసేందుకు కూడా విద్యార్థులకు సరిపడా బాత్‌రూంలు లేవు. గురుకుల పాఠశాలకు స్వంత భవనం ఏర్పాటు చేస్తే బాగుటుంది.

– అరవింద్, 9వ తరగతి గురుకుల పాఠశాల

ఉన్నతాధికారులకు వివరించాం



సమస్యలను ఉన్నతాధికారులకు వివరించాం. విద్యార్థులకు సరిపడా తరగతి గదులు, భోజనశాల, రీడింగ్ రూమ్‌లు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నది వాస్తవమే. క్రీడాప్రాంగణం లేక ఆటలకు దూరమవుతున్నారు. స్వంత భవనం కోసం నిధులు మంజూరు చేయాలని కోరాం.

– అకుల్, ప్రిన్సిపాల్, గురుకుల పాఠశాల

రోగులకు మెరుగైన వైద్య సేవలు



రోగుల వివరాలు పరిశీలిస్తున్న కలెక్టర్ బాదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్ క్రైం: రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని జనరల్ ఆస్పత్రిని సందర్శించి, ఐసీయూలో రోగులకు అందించే చికిత్సను కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ ఆస్పత్రి అన్ని విభాగాలను పరిశీలించి వైద్యులతో మాట్లాడారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, మందులు అందుబాటులో ఉంచాలన్నారు. సీజనల్ వ్యాధులు రాకుండా చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బందికి సూచించారు. కలెక్టర్ వెంట జిల్లా ఆస్పత్రి ఆర్‌ఎంఓ డాక్టర్ అజీమ్, డాక్టర్ రోహిత్, డాక్టర్ ప్రమోద్, ఇతర వైద్యులు ఉన్నారు.

మాదకద్రవ్యాలతో జీవితం చిన్నాభిన్నం

తెలకపల్లి: మాదకద్రవ్యాలతో జీవితం చిన్నాభిన్నం అవుతుందని డిప్యూటీ చీఫ్ లిగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిలర్ శ్రీరాం ఆర్యా అన్నారు. బుధవారం మండలంలోని ఆలేరు ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. లీగల్ సర్వీస్, పలు పిల్లల స్కీమ్స్‌పై అవగాహన కల్పించారు. బాలల హక్కుల గురించి వివరిస్తూ బాల బాలికలు అందరు పాఠశాలకు రావాలని కోరారు. బాలికలను ఆకతాయిలు వేధిస్తే షీం టీంకు, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. ఉచిత న్యాయ సహాయం కోసం టోల్ ఫ్రీ నంబర్ 15100 కు ఫోన్ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం బచ్చన్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లిఫ్టు ఇరిగేషన్ పరిశీలన

పెంట్లవెల్లి: మండలంలోని మల్లేశ్వరంలో ఈ నెల 8న పాత లిఫ్టు ఇరిగేషన్ ఎత్తిపోతల పథకంపై పిడుగు పడింది. దీంతో మల్లేశ్వరం గ్రామం నుంచి ఇంజన్ బోట్ల ద్వారా ఇరిగేషన్ అధికారులు సీఈ విజయ్ భాస్కర్‌రెడ్డి, డీఈ శ్రీనివాస్, ఏడబ్ల్యూఏ జయరాములు ఘటనా స్థలానికి చేరుకుని లిఫ్టు ఇరిగేషన్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారులు గ్రామస్తులు అశోక్ నంద, తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓ ఆకస్మిక తనిఖీ



లింగాల: మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను, మండలం పరిధిలోని కొత్తకుంటపల్లి ప్రాథమిక పాఠశాలను బుధవారం మండల విద్యాధికారి బషీర్ అహ్మద్ ఆకస్మిక తనఖీ చేశారు. పలు రికార్డులను ఎంఈఓ పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని, పరిసరాలను పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు నరసింహ రెడ్డి, మంగమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆత్మీయ భరోసా ఇవ్వాలి

పెంట్లవెల్లి: ఉపాధి కూలీలకు ఆత్మీయ భరోసా ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి నర్సింహ డిమాండ్ చేశారు. బుధవారం జటప్రోలు తదితర గ్రామాలలో ఉపాధి కూలీలు, ప్రజలతో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో హనుమంతు, దామోదర్, రమేష్, రాములు పాల్గొన్నారు.

రిజర్వాయర్ నిర్మాణంపై అభిప్రాయ సేకరణ



వెల్దండ: మండలంలోని అజిలాపూర్‌లో డిండి–నార్లాపూర్ (డీఎల్‌ఐ)లో నిర్మాణంలో ఇర్విన్ రిజర్వాయర్ నిర్మాణంపై బుధవారం అధికారులు రైతుల నుంచి అభిప్రాయ సేకరణ చేపట్టారు. అజిలాపూర్‌లో దాదాపుగా 92 మంది రైతులకు సంబంధించి 187 ఎకరాల భూమి సేకరణ చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. అదే విధంగా రంగారెడ్డి జిల్లా ఇర్విన్ రెవెన్యూ శివారులో మరికొంత మంది రైతుల భూములు సేకరిస్తున్నట్లు పేర్కొన్నారు. భూములు కోల్పోతే జీవానాధారం లేకుండా పోతుందని అధికారుల ముందు రైతులు గోడు వెళ్లబోసుకున్నారు. కార్యక్రమంలో కల్వకుర్తి ఆర్డీఓ జనార్దన్‌రెడ్డి, వెల్దండ తహసీల్దార్ కార్తీక్‌కుమార్, ఆర్‌ఐ శంకర్, సుల్తాన్, ఇరిగేషన్ ఏఈ ప్రసాద్, వెల్దండ సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

నిందితులకు రిమాండ్

తిమ్మాజిపేట: మండలంలోని వెంకాయపల్లిలో గొర్రెల దొంగతనానికి పాల్పడిన ముగ్గురు వ్యక్తులను బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం ఈనెల 13 వెంకాయపల్లి గ్రామ సమీపంలో కృష్ణకుమార్ సంబంధించిన గొర్రెలను ఎత్తుకెళ్లారు. హైదరాబాద్‌కు చెందిన అక్బర్, ఫైజన్, ఫైసల్‌లు దొందతనానికి పాల్పడగా వారిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వేర్వేరు రోడ్డుప్రమాదంలో నలుగురికి గాయాలు

తిమ్మాజిపేట: మండలంలోని మరికల్ గ్రామం కమాన్ దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలైన ఘటన బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం గుమ్మకొండ గ్రామానికి చెందిన భాస్కర్ మృతదేహాన్ని చూసేందుకు మహబూబ్‌నగర్ ఆస్పత్రికి గ్రామం నుంచి బాలచంద్రయ్య కుమారుడితో కలిసి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో మరికల్ గ్రామ కమాన్ దగ్గర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో తండ్రి, కొడుకులు గాపపడ్డారు. అదేవిధంగా తిమ్మాజిపేటకు చెందిన మరో ఇద్దరు మరికల్ కమాన్ వద్ద బైక్ అదుపుతప్పి కిందపడి గాయపడ్డారు.

ఘనంగా రాజీవ్‌గాంధీ జయంతి



సాక్షి, నెట్‌వర్క్: నాగర్‌కర్నూల్ జిల్లాలోని పలు మండలాల్లో బుధవారం భారత మాజీ ప్రధాన మంత్రి రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి కేక్ కట్ చేశారు. కొల్లాపూర్ పట్టణంలోని శ్రీ వాణి విద్యానిలయంలో పండ్లు, స్వీట్లను కాంగ్రెస్ నాయకుడు రంగినేని జగదీశ్వరుడు పంపిణీ చేశారు. అదేవిధంగా కల్వకుర్తిలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నివాళులర్పించారు. అచ్చంపేట పట్టణంలోని రాజీవ్ చౌరస్తాలో రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేశారు. తాడూరు, వెల్దండలో రాజీవ్‌గాంధీ సేవలను పలువురు కొనియాడారు. తెలకపల్లిలో కేక్ కట్ చేశారు.

వర్షానికి కూలిన ఇళ్లు

తిమ్మాజిపేట/తెలకపల్లి: కొన్ని రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో పలు గ్రామాల్లో ఇళ్లు కూలాయి. తిమ్మాజిపేట మండలంలో సూర్యనాయక్ తండాకు చెందిన గౌరీ సంబంధించిన ఇల్లు, అప్పాజిపల్లిలో అప్పల నర్సింహ, పుల్లగిరిలో వడ్ల సాయమ్మ, మిద్దె బాలయ్య ఇండ్లు నేలమట్టం అయ్యాయి. అదేవిధంగా తెలకపల్లి మండలంలోని గౌరారంలో కూలిపోయినట్లు బిరుదు లక్ష్మయ్యకు సంబంధించిన ఇల్లు కూలింది.

తగ్గని వరద ఉధృతి



తాడూరు: మండల కేంద్రంలోని ఆయా గ్రామాల్లో మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి చెరువు కుంటలు అలుగు పారుతున్నాయి. దుందుబీ వాగులో వరద ఉధృతి తగ్గలేదు. సిర్సవాడ దగ్గర రాకపోకలను నిలిపి వేసి అడ్డంగా బారికేడ్లు ఏర్పాటు చేశారు. అదేవిధంగా చర్లాతిర్మాలాపూర్ జలమయం అయ్యింది.

శ్రీనిధి రుణాలు రికవరీ చేయాలి

తిమ్మాజిపేట: మండల మహిళా సమాఖ్య, ఆయా బ్యాంకుల నుంచి తీసుకున్న శ్రీనిధి రుణాలను విధిగా వసూలు చేయాలని నాగర్‌కర్నూల్ జిల్లా రీజినల్ మేనేజర్ మహేంద్రకుమార్ అన్నారు. మండల కేంద్రంలోని మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో బుధవారం స్థానిక అధికారులు, గ్రామ మహిళా సంఘాలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని పోతిరెడ్డిపల్లి, చేగుంట, గొరిట, తిమ్మాజిపేట గ్రామాలల్లో శ్రీనిధి రుణాలు తీసుకున్నారని కాని సకాలంలో చెల్లించకపోవడంతో ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఏపీఎం నిరంజన్, సీసీలు నాగరాజు, తిరుపతమ్మ, మంగమ్మ, గ్రామాల అధ్యక్షులు లలితమ్మ, మంజుల, నూర్జహాన్, వీఓఏలు సుమలత, నర్మదా, లక్ష్మి, జ్యోతి, మౌనిక ఉన్నారు.

నీటి నిల్వలు లేకుండా చర్యలు

బిజినేపల్లి: నీటి నిల్వలు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని పీహెచ్‌సీ వైద్యాధికారి డా.ప్రియాంక అన్నారు. బుధవారం డ్రైడే లో భాగంగా పాలెం పీహెచ్‌సీలో ప్రజారోగ్యంపై వైద్యసిబ్బందికి అవగాహన కల్పించారు. అపరిశుభ్రతతో వచ్చే వ్యాధుల గురించి ప్రజలకు వివరించాలని తెలిపారు. పాలెం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

పెంట్లవెల్లి: మండల కేంద్రంలో నూతనంగా నిర్మించనున్న అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణానికి అయ్యప్ప సేవా సమితి నాయకులు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గురుస్వామి రామచంద్రయ్య మాట్లాడుతూ దాతలు సహకరిం

స్థల పరిశీలన

తిమ్మాజిపేట: మండలంలోని ఆవంచలో మాజీ మంత్రి డాక్టర్ ఆవంచ లక్ష్మారెడ్డి సతీమణి డాక్టర్ శ్వేత విగ్రహం ఏర్పాటు కోసం బుధవారం ఆయన స్థలాన్ని పరిశీలించారు. అజయ్, ఊశన్న, నాయకులు మోహనాచారి, వెంకటయ్య, ప్రభకర్‌చారి, క్రిష్ణయ్య తదితరులు ఉన్నారు.

ప్రీ ప్రైమరీలో ప్రవేశాలు

కందనూలు: నాగర్‌కర్నూల్ జిల్లాలో ప్రస్తుత విద్యా సంవత్సరానికి 21 ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ తరగతుల్లో ప్రవేశాల ప్రక్రియ ప్రారంభించినట్లు డీఈఓ రమేష్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 4 నుండి 5 సంవత్సరాల వయస్సు ఉన్న చిన్నారులు అర్హులని తెలిపారు. ఈ అవకాశాన్ని తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులను సంప్రదించాలని కోరారు.

యూరియా అందించాలని నిరసన



బిజినేపల్లి పీఏసీఎస్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

నాగర్‌కర్నూల్ రూరల్: రైతులకు సరిపడా యూరియా అందించాలని సీపీఎం జిల్లా నాయకులు అశోక్ డిమాండ్ చేశారు. బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో వ్యవసాయ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండెకరాలకు తక్కువగా ఉన్న రైతులకు యూరియా అందించడం లేదని దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. యురియాను అధిక ధరలకు అమ్ముతున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్, సంతోష్, బాలపీరు, రాములు, వెంకటయ్య పాల్గొన్నారు.

పీఏసీఎస్ కార్యాలయం ఎదుట ధర్నా

బిజినేపల్లి: మండలంలోని పీఏసీఎస్ కార్యాలయం ఎదుట ధర్నా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు గుంపల్లి అశోక్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూరియా, నానో లిక్విడ్ యూరియా సబ్సిడీ ద్వారా రూ.900లకు అందిస్తే బయట కేవలం ఒక బస్తా యూరియాకు రూ.1500 విక్రయిస్తున్నారని వాపోయారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులు రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. చంద్రశేఖర్, సంతోష్, బాలపీరు, రాములు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో..

పెద్దకొత్తపల్లి: మండలంలోని సింగిల్ విండో కార్యాలయం ఎదుట బీజేపీ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు బీమేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ఐదు రోజుల నుంచి యూరియా కోసం రైతులు సింగిల్ విండో కార్యాలయం వద్దకు వస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో లింగస్వామి, మేకల శివ, బంటుపల్లిశివ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీమేశ్వర్‌రెడ్డి

గ్రామాల్లో బీజేపీ జెండాను ఏర్పాటు చేస్తాం

లింగాల: మండలంలోని 23 గ్రామ పంచాయతీలలో బీజేపీ జెండాను ఏర్పాటు చేస్తామని బీజేపీ మండల అధ్యక్షుడు గువ్వని నవీన్ తెలిపారు. మండలంలోని పద్మన్నపల్లిలో బుధవారం జెండా దిమ్మె నిర్మాణం కోసం భూమి చేసి పనులను ప్రారంభించారు. నాయకులు విష్ణు, హేమంత్, మహేష్, ఈశ్వరయ్య, కిషోర్, శంకర్, రమేష్, రవీందర్, రవి, సురేందర్‌రెడ్డి, గణేష్ పాల్గొన్నారు.

కేబుల్ వైర్లు సరిచేయాలి

కల్వకుర్తి రూరల్: వినాయక ఉత్సావాల సందర్భంగా వేలాడుతున్న కేబుల్ వైర్లు సరి చేయాలని విద్యుత్ సూపరింటెండెంట్ ఇంజనీర్ నరసింహారెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని విద్యుత్ ఏడీఈ కార్యాలయంలో కేబుల్, ఇంటర్నెట్ ఆపరేటర్లతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. వేలాడుతున్న కేబుల్ వైర్లను, నిరుపయోగంగా ఉన్న వైరులను వెంటనే తొలగించాలన్నారు. సమావేశంలో విద్యుత్ ఏఈ శ్రీనివాస్ నాయక్ సిబ్బంది పాల్గొన్నారు.

సామాజిక సేవలో లయన్స్‌క్లబ్ అగ్రగామి

కల్వకుర్తి రూరల్: సామాజిక సేవలో లయన్స్‌క్లబ్ అగ్రగామిగా ఉందని లయన్స్‌క్లబ్ మాజీ గవర్నర్ జూలూరు రమేష్ బాబు అన్నారు. బుధవారం క్లబ్ ఆధ్వర్యంలో మీల్స్ ఆన్ వీల్స్ కార్యక్రమంలో భాగంగా ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఆయన జన్మదినం సందర్భంగా ప్రయాణికులు 300 మందికి అన్నప్రసాదం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ గవర్నర్ మాట్లాడుతూ ఎంతోమందికి కంటి చికిత్సలు, మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి సేవలు అందిస్తున్నామన్నారు. నాగర్ కర్నూల్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడుబచ్చు రామకృష్ణ మాట్లాడుతూ క్లబ్ సేవలను మరింత విస్తరిస్తామన్నారు. కల్మిచర్ల రమేష్, చిగుళ్లపల్లి శ్రీధర్, కల్మచర్ల గోపాల్, గుబ్బా కిషన్, పోలా రాజేందర్, అప్పయ్యపల్లి శ్రీనివాస్, జూలూరు సత్యం, జూలూరు ప్రకాష్, పాలకూర రవి గౌడ్, గణేష్ దారమొని, తదితరులు పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

వైభవంగా బోనాల పండుగ



జూపల్లిలో బోనాలతో వెళ్తున్న మహిళలు

చారకొండ/బల్మూరు/ఉప్పునుంత: చారకొండ మండల కేంద్రంతో పాటు జూపల్లి, తుర్కలపల్లి, బల్మూరు మండలంలోని రామాజిపల్లిలో బుధవారం పోచమ్మ బోనాల ఉత్సవాలను నిర్వహించారు. ఉప్పునుంతలలో కోట మైసమ్మ దేవతకు బోనాలు సమర్పించారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.



బల్మూరు రామాజిపల్లిలో..

సస్యరక్షణ చర్యలతో చీడపీడల నివారణ

బిజినేపల్లి: సస్యరక్షణ చర్యలతో చీడపీడల నివారణ సాధ్యమని పాలెం కేవీకే కో–ఆర్డినేటర్ డా.పి.శ్రీదేవి అన్నారు. బుధవారం పాలెం కృషి విజ్ఞాన కేంద్రంలో పార్థీనీయం(వయ్యారి భామ) కలుపు మొక్క నిర్మూలనలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త డా.పి.శ్రీదేవి మాట్లాడుతూ పార్థీనీయం మొక్కలు పంట పొల్లాలో ఉండే పంటకు నష్టం కలిగిస్తాయని, పంట పరిసర ప్రాంతాల్లో పార్థీనీయం మొక్కను వేర్లతో పీకి కాల్చివేయ్యాలన్నారు. రావేఫ్ విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

ఆరోగ్య శిబిరం ఏర్పాటు

కల్వకుర్తి రూరల్: పట్టణంలో వాసవీ క్లబ్ కల్వకుర్తి, లయన్స్ క్లబ్ ఆమనగల్ సమితి ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన ఉచిత మధుమేహ వైద్య శిబిరాన్ని వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ జూలూరు రమేష్ బాబు ప్రారంభించారు. 50 మంది మధుమేహ పరీక్షలు చేసుకున్నారు. సంపత్ కుమార్, బాదం రాఘవేందర్, కోటేశ్వర్, శ్రీనివాసులు, వెంకటరెడ్డి, లక్ష్మారెడ్డి, నరసింహారెడ్డి, వాసవీ క్లబ్ మాజీ అధ్యక్షుడు గోపాల్, శంకర్, సత్యం, అశోక్, శ్రీధర్, హరీష్, ప్రభాకర్, నారాయణరాజు పాల్గొన్నారు.

ముస్లింలు వనప్రవేశం

లింగాల: మండలంలోని అంబట్‌పల్లిలో ముస్లింలు ఆకర్ చర్మంబా సందర్భంగా బుధవారం వనప్రవేశానికి వెళ్లి సామూహిక వన భోజనాలు నిర్వహించారు. పగలంతా ఆటపాటలతో గడిపారు. అంతకుముందు సయ్యద్ పీర్ల దగ్గర ఫాతెహా ఇచ్చి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో మైనార్టీ పెద్దలు షేక్ మన్నాన్, ఖాజా, అజమ్, సుల్తాన్, దర్వేష్, నిరంజన్, అజీజ్, మదర్, మజీద్, జమీల్, సయ్యద్, మన్సూర్, సలీం, ఖాదర్ పాల్గొన్నారు.

కృష్ణుడి ప్రతిమ ఊరేగింపు

కల్వకుర్తి రూరల్: మండలంలోని రఘుపతిపేటలో బుధవారం కృష్ణాష్టమి వేడుకలు ముగిశాయి. త్రైత సిద్ధాంత ప్రభు సేవ సమితి ఇందు జ్ఞాన వేదిక నాగర్ కర్నూల్ కమిటీ ఆధ్వర్యంలో కృష్ణుడి ప్రతిమను ప్రతిష్ఠించి పూజలు చేశారు. అనంతరం కృష్ణుడి ప్రతిమను గ్రామంలో ఊరేగించారు. కార్యక్రమంలో డాక్టర్ బాలస్వామి, మనోహర్, శ్రీనివాసులు, శివ, నిరంజన్, సాయి శంకర్, తిరుపతి, రాము తదితరులు పాల్గొన్నారు.

సైబర్‌నేరాలపై అవగాహన

లింగాల: మండలంలోని రాయవరంలో బుధవారం సైబర్ నేరాలపై ఎస్‌ఐ వెంకటేశ్వర్‌గౌడు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ వ్యక్తిగత సమాచారం ఎవరికి చెప్పొద్దన్నారు. సైబర్ నేరగాళ్ల చేతిలో మోస పోయినట్లు గుర్తిస్తే వెంటనే పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని లేదా 100, 1930 నంబర్లకు ఫోన్ చేయాలని ఎస్‌ఐ ప్రజలను కోరారు.

వంతెన నిర్మాణంలో నిర్లక్ష్యం వహించొద్దు

కందనూలు: వంతెన నిర్మాణంలో నిర్లక్ష్యం వహించొద్దని బీజేపీ పట్టణ అధ్యక్షుడు ప్రమోద్‌కుమార్ అన్నారు.బుధవారం నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీ పరిధిలోని ఎండబెట్లలో కేసరి సముద్రం బ్రిడ్జిని ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వారం రోజులుగా భారీ వర్షాలకు మూల మలుపు వంతెన దెబ్బతిందన్నారు. దీంతో ప్రయాణికులు ప్రమాదాలబారిన పడుతున్నారన్నారు. సతీష్ కుమార్, నాగమణి, అనిల్ పాల్గొన్నారు.